సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం | 31 | అక్టోబర్ | 2023



కాలువకు 'గండి' కొట్టారు..!

హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) కి బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద పడింది గండి కాదని తేలింది. II- లో



ప్రియుడి కోసం భర్తను చంపిన భార్య

ప్రియుడిపై మోజుతో కట్టుకున్న భర్తను భార్య అంత మొందించిన సంఘటన ఆదివారం అర్ధ రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. II- లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.240	రూ.310
రెండోరకం	రూ.140	రూ.280



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 428 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	255	513
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 569.18 కిలోలు

న్యూస్‌రీల్

అర్జీలపై స్పందించాలి



ప్రజల సమస్యలను వింటున్న ఎస్పీ బి కృష్ణారావు

రాయచోటి: స్పందన ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీలపై ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులు స్పందించి వారిలో నమ్మకం కలిగించేలా సహకరించాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను సానుకూలంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 86 మంది అర్జీలను అందజేశారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు.

ఉచితంగా సరుకుల పంపిణీ

రాయచోటి : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నవంబర్ నెలకు బియ్యం రాగులు, గోధుమ పిండి, జొన్నలు, చక్కెర, కందిపప్పు తదితర వాటిని రేషన్‌కార్డుదారులకు ఉచితంగా అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం బదులుగా రాగులు, జొన్నలు ఒక కేజీ నుంచి 3 కేజీల వరకు ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి కార్డుదారుడు కందిపప్పు కిలో రూ.67 చక్కెర తెల్లకార్డుకు ఒక కిలో రూ.17, ఏఏవై కార్డుకు ఒక కిలో రూ.13.50కి. గోధుమపిండి కిలో ప్యాకెట్ రూ.16గాను నగదు చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు. నవంబర్ నెలకు కిలో కందిపప్పు 50 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. డిసెంబర్ నెల నుంచి 100 శాతం కేటాయింపులు జరుగుతాయని తెలియజేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లోకు నెలవారీ బియ్యం, కందిపప్పు, నూనె తదితర వాటిని ప్రభుత్వ వాహనాలు ద్వారా పొందవచ్చు అన్నారు. నవంబర్ నెలలో అందిస్తున్న వస్తువుల గురించి ప్రజలకు వివరంగా తెలియపరచాలని డీలర్లు, రెవెన్యూ అధికారులు, వాహన ఆపరేటర్లకు జేసీ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ చేసేందుకు ఆసక్తిగల ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో డీజిల్ మెకానిక్ 47, మోటారు మెకానిక్ 8, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, మిషనిస్టు 2, ఫిట్టర్ 2, డ్రాఫ్ట్ సివిల్ 2 కలిపి మొత్తం 67 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. నవంబరు 1 నుంచి 15వ తేదీలోగా అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటీస్‌షిప్.ఇండియా.జీఓవీ.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7382869399, 7382873146 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లక్ష శివలింగాల తయారీ

ప్రొద్దుటూరు కల్చరల్ : కాశీలో సమర్పించేందుకు ప్రొద్దుటూరు పట్టణంలోని సత్యారైస్‌మిల్‌లో లక్ష శివలింగాలను బాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భక్తులు తయారీ చేస్తున్నారు. మహిమాన్విత కాశీలో మహారాజా ఛేత్‌సింగ్ పిలిగ్రిమేజ్ సెంటర్ శివాలఘాట్‌లో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 19 నుంచి 27వ తేదీ వరకు కోటి పార్థివ శివలింగాలకు అభిషేక అర్చనలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాదులోని శ్రీ విజయానందనాథ గురు సేవా సమితి ఆధ్వర్యంలో శివలింగాలను రూపొందిస్తున్నారు.

అడుగు.. ఇక స్వేచ్ఛగా..!

- విద్యార్థినుల ఆరోగ్యానికి భరోసా కల్పించే 'స్వేచ్ఛ'
- పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గిస్తున్న పథకం
- విద్యార్థినులకు ఉచితంగా న్యాప్‌కిన్స్

మదనపల్లె సిటీ : ప్రభుత్వం విద్యకే కాదు.. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యమిస్తోంది. అంతేనా బాలికల ఆరోగ్య పరిరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్ రెండవ విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో కిశోర బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'స్వేచ్ఛ' పథకాన్ని అమలు చేస్తోంది. బాలికలు రుతుక్రమ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవడం పాఠశాలల్లో డ్రాపౌవుట్స్‌కు కారణమవుతోంది. దీన్ని నివారించేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే కిషోర బాలికలకు ఉచిత శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది అక్టోబర్ 5న ప్రారంభించారు.



కిషోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

2,213 పాఠశాలలల్లో...

జిల్లాలోని 30 మండలాల్లో 2,213 పాఠశాలలున్నాయి. ఇందులో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 35,690 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో 64 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల విద్యార్థినులకు కూడా న్యాప్‌కిన్స్ అందిస్తున్నారు. మండలాల వారీగా ఆయా విద్యా సంస్థలకు బ్రాండెడ్ న్యాప్‌కిన్స్ సరఫరా చేశారు. ఈ పథకం ద్వారా కిశోర బాలికల హాజరు శాతం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో..

కౌమార దశలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్నారు. గతంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయగా, ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖలోని మధ్యాహ్న భోజన పథకం విభాగానికి అప్పగించారు. దీంతో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ న్యాప్‌కిన్స్ నాణ్యతను పరిశీలించి ఏ పాఠశాలకు ఎన్ని అవసరమో గుర్తించి, పాఠశాలలకు సరఫరా చేసేలా చూస్తుంది. అక్కడ సైన్సు టీచర్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తారు. రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, నివారణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించడానికి మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ద్వారా పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం అమలుకు మహిళా ఉపాధ్యాయురాలిని నోడల్ టీచర్‌గా ఎంపిక చేశారు. వీరు విద్యార్థులకు న్యాప్‌కిన్స్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు.

కట్టుబాటు నుంచి స్వేచ్ఛలోకి..

రాష్ట్రంలోని మహిళలు ,బాలికలు 'కట్టుబాటు నుంచి స్వేచ్ఛ'లోకి నినాదంతో అమలవుతున్న కార్యక్రమంలో భాగంగా వారి పరిశుభ్రత, ఆరోగ్యానికి భరోసా కల్పించేలా 'స్వేచ్ఛ' ద్వారా విద్యా సంస్థల్లో ఉచిత న్యాప్‌కిన్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి విద్యార్థినికి రెండు నెలలకోసారి 10 ప్యాకెట్లు వంతున అందిస్తారు.



ప్రతి విద్యార్థినికి ఉచితంగా న్యాప్‌కిన్స్ ప్యాడ్స్



పాఠశాలలో చదువుతున్న కిషోర బాలికలకు ఉచితంగా న్యాప్‌కిన్స్ ప్యాడ్స్ అందిస్తున్నాం. విద్యార్థినులకు సైన్సు ఉపాధ్యాయురాలు రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం స్వేచ్ఛ పేరుతో ఉచితంగా న్యాప్‌కిన్స్‌ప్యాడ్స్ అందజేయడంతో హాజరు శాతం పెరుగుతుంది.

-శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, రాయచోటి

అందరి ఆరోగ్యం కోసం



కిషోర బాలికలకు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేస్తున్నాం. రుతుక్రమ శుభ్రత, ప్యాడ్స్ వాడకం గురించి తెలియజేస్తున్నాం. విద్యార్థునుల్లో అవగాహన పెరిగింది.

-శైలశ్రీ, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె

ప్రభుత్వం నిర్ణయం బాగుంది



ప్రభుత్వ పాఠశాలల్లో కిషోర బాలికలకు ప్రభుత్వం ఉచితంగా న్యాప్‌కిన్స్ ప్యాడ్స్ అందజేయడం బాగుంది. బాలికల విద్య కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఇది మంచి కార్యక్రమం.

-జె.లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం



జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను వివరించారు. పులివెందుల నుంచి అంకెవానిపల్లెకు సాయంత్రం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరారు. గాలివీడు నుంచి నూలివీడు మార్గంలో సాయంత్రం 4 గంటలకు, కోనంపేట నుంచి వేంపల్లెకు సాయంత్రం 5 గంటలకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. బద్వేలు–పామూరు రూటులో తిరుగుతున్న బస్సులు కండీషన్‌లో లేవని ఫిర్యాదు చేశారు. సింహాద్రిపురం, వెలిదండ్లకు సాయంత్రం 5 గంటలకు, సింహాద్రిపురం నుంచి పులివెందులకు వయా కోవరంగట్టుపల్లె, బలపనూరు మీదుగా బస్సులను తిప్పాలని కోరారు. బద్వేలు–మార్కాపురం బస్సు ఏర్పాటు చేయాలని విన్నవించారు. వేంపల్లె–విజయవాడ సర్వీసు సమయపాలన పాటించేలా చూడాలని, కావలి నుంచి బెంగుళూరుకు వెళ్లే బస్సుల డ్రైవర్లు బద్వేలు వరకు మాత్రమే టిక్కెట్ ఇస్తున్నారని, కడప వరకు ఇవ్వాలని కోరారు. కడప–పామూరు, కడప–పామూరుకు బస్సు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ప్రయాణికుల సమస్యలు, సలహాలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. 995922 5774 నంబర్‌కు సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

హెలిప్యాడ్ ఎంపికపై స్థల పరిశీలన

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయచోటిలో పర్యటన నేపథ్యంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కృష్ణారావు పలు ప్రాంతాలను పరిశీలించారు. అధికారులతో కలిసి వారు సోమవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను పరిశీలించారు. నవంబర్ నెల రెండో వారంలో రాయచోటిలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉంది. ఈ మేరకు రాయచోటిలోని అభి పంక్షన్ హాల్ సమీపంలో, ఇండస్ట్రియల్ ప్రాంతాలలో హెలిప్యాడ్ కోసం స్థలాలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. నిబంధనలను అనుసరించి భద్రతా పరంగా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనపై అధికారికంగా సమాచారం అందాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచించారు. అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ సహదేవరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సిఐ సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి పర్యటనకు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

విజ్ఞానాన్ని వెలికితీయండి

రాయచోటి టౌన్ : విద్యార్థులలో దాగి ఉన్న వి/జ్ఞానాన్ని వెలికి తీసి వారిలో సృజనాత్మకతను పదును పెట్టేందుకు సైన్స్ కలామ్స్ విజన్ 2023 ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాం పురుషోత్తం అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో కలామ్స్ విజన్ 2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో వి/జ్ఞానం దాగి ఉంటుందని ఆ వి/జ్ఞాన్ని వెలికి తీసి ఆవిష్కరింపజేయాలన్నారు. ప్రతిభా జూనియర్ కళాశాల చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి మాట్లాడుతూ మానవుడి మనుగడకు సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అలాంటి సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచే విధంగా సైన్స్ వి/జ్ఞాన కేంద్రాలను పరిచయం చేయాలని సూచించారు. ఈ సైన్స్ స్పేర్‌లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చుని, ఈ సైన్స్‌ఫేర్ నవంబర్ 28,29వ తేదీలలో రాయచోటిలోని ఇంటర్నేషనల్ మెరిట్ హైస్కూల్‌లో నిర్వహిస్తామని నిర్వహకుడు కలామ్స్ విజన్ 2023 వినయ్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 6281453550, 93919 32752 నంబర్లలో ఫోన్ చేయాలని సూచించారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలామ్స్ విజన్ 2023 సభ్యులు

ఆపద వేళ.. అమృత హస్తం!

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్‌తో ఉపశమనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 9 రకాల వ్యాధిగ్రస్తులకు పెన్షన్
- వ్యాధిని బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు అందజేత



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు నూర్ అహ్మద్. చిన్నమండెంకు చెందిన ఇతను తలసీమియాతో బాధపడుతున్నాడు. పేదరికం వల్ల పూటకోసారి వేల రూపాయల పెట్టి చికిత్స అందించడం తండ్రి ఫయాజ్ అలీఖాన్‌కు తలకు మించిన భారమైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ హెల్త్ పెన్షన్ స్కీం ఆపన్నహస్తమై నిలిచింది. రూ.10 వేల పింఛన్ ఠంచన్‌గా అందుతోంది. వెరసి ప్రతినెలా మదనపల్లె, రాయచోటి తదితర ప్రాంతాల్లో బిడ్డకు రక్త మార్పిడి చేయించుకుంటున్నారు. మనసున్న సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.. ఆయన చల్లగా ఉండాలి.. అంటూ చేతులెత్తి దువా చేశాడు ఫయాజ్ చెమర్చిన కళ్లతో..

తలసీమియా బాధితులు	62
సెకిల్ సెల్ బాధితులు	16
హిమోఫిలియా	31
బోదకాలు	10
లివర్ బాధితులు	31
లెప్రసీ సంబంధిత బాధితులు	274
బలహీనత, ఇతర కేసులు	578

సాక్షి రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలుస్తూ మనసున్న సీఎంగా ఖ్యాతిగడించారు. తన పాదయాత్ర సమయంలో దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారిని చూసి చలించిపోయిన ఆయన అధికారంలోకి రాగానేవారిని ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ పథకం అమలు చేశారు. వ్యాధిని బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతి నెలా అందజేస్తున్నారు.

జిల్లాలో వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్‌కు సంబంధించి ఉన్నతాధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన బాధితులకు అండగా నిలుస్తున్నారు. 2020లో ప్రారంభమైన వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ పథకం ద్వారా అన్నమయ్య జిల్లాలో సుమారు 2030 మందికి ప్రతినెల రూ.1.50 కోట్ల మేర అందిస్తున్నారు. అత్యధికరంగా పెరాలసిస్‌కు సంబంధించి 1016 మంది పింఛన్ తీసుకుంటున్నారు. అలాగే కిడ్నీ సమస్యల బాధితులు 578 మంది జిల్లాలో కనిపిస్తున్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.3 వేలు పింఛన్ ఇస్తుండగా కిడ్నీ, లివర్, గుండె రీప్లేస్‌మెంట్ జరిగిన రోగులకు, కిడ్నీ బాధితులు(సీరం క్రియాటిన్ 5 ఎంఎం కంటే ఎక్కువ) ఉన్న వారికి తీవ్రంగా కండరాల క్షీణతతో పాటు ప్రమాదాలతో మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారికి, చక్రాల కుర్చీ, మంచానికి పరిమితమైన పక్షవాతం ఉన్న రోగులకు, బోదకాలు(రెండు కాళ్లకు) ఉన్న వారికి నెలకు రూ.5 వేలు పింఛన్ అందజేస్తున్నారు. తలసీమియా మేజర్, సికిల్‌సెల్, సివియర్ హిమోఫీలియా (2 శాతం పైబడి) ఉన్న రోగుకుల నెలకు రూ.10 వేలు ఇస్తున్నారు.

ఆపన్న హస్తం

రెక్కాడితేగానీడొక్కాడని పేదలకు వైఎస్సార్ హెల్త్ పెన్షన్ ప్రయోజనకరంగా మారింది. ముందే ఆరోగ్యం కూడా సరిగాలేక కూలీపనులకు కూడా వెళ్లలేని వారికి జగన్ సర్కార్ అండగా నిలబడుతోంది. గతంలో అసలు పింఛన్‌కే అవకాశం లేని వీరందరికీ ప్రస్తుతం రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు పింఛన్ అందుతుండడంతో అందరిలోనూ హర్షం వ్యక్తమవుతోంది.

పదివేల పింఛన్ వస్తోంది..



నేను డయాలసిస్‌తో బాధపడుతున్నా. విషయం తెలుసుకున్న మా వలంటీర్ రెడ్డి ముని ఎమ్మెల్యే, అధికారుల దష్టి కి తీసుకెళ్లి. నాకు రూ.10000 పింఛన్ మంజూరు చేయించారు. ఇప్పుడు వారానికి ఒకసారి డయాలసిస్ చేయించుకొంటున్నాను

- అంబమ్మ, నీను నామాలగుట్ట

ప్రభుత్వం చేయూత

దీర్ఘకాలిక అనారోగ్యం, ప్రమాదాలతో నడవలేని పరిస్థితితో సాధారణ జీవనం గడపలేని వారికి ప్రభుత్వం వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ ద్వారా చేయూతనిస్తోంది. వ్యాధి నిర్ధారణకు సంబంధించి సదరమ్, మెడికల్ బోర్డు పారదర్శకంగా పనిచేసేలా పక్కా చర్యలు తీసుకున్నాం. నిరంతరం సంబంధిత ఉన్నతాధికారులతో పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం తలపెట్టిన పెన్షన్ పథకం నిజమైన రోగులకు చేరాలన్నదే లక్ష్యం.

- పీఎస్ గిరీషా, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

రాయచోటి : ప్రజలు అందజేసే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎస్‌డీసీ పి.శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.



ప్రజల నుంచి వివిధ సమస్యల పట్ల వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

స్పందన విజ్ఞప్తులలో కొన్ని ..

- ప్రభుత్వం తనకు మంజూరు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకున్నానని.. కానీ రహదారి కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఇతరులు ఆక్రమించారని గాలివీడు మండలం గోరాన్‌చెరువుకు చెందిన జి.శివశంకర్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.
- ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని బేస్‌మట్టం వరకు నిర్మించుకున్నానని.. ఇంతవరకు బిల్లు రాలేదని నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెకు చెందిన బండపల్లి నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను విచారణ చేసి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి చేశారు.

'ఆరోగ్య'శిబిరాలను విజయవంతంగా నిర్వహించాలి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియా, తదితర అంశాలపై మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అన్ని మండలాల్లో చిన్నపాటి సమస్య తలెత్తకుండా క్యాంపులను నిర్వహించాలన్నారు. జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య శిబిరాలలో ఎక్కడెక్కడ కంటి ఆపరేషన్‌లు జరిగాయి, అందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ రిపోర్టు తమకు పంపాలన్నార. జిల్లాలో బడి బయట ఉన్న బడిఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియా) చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ప్రాధాన్యత భవనాలు పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ప్రభుత్వ ప్రియారిటీ భవన నిర్మాణాలపై పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కాలువకు గండి కొట్టారు..!

- పీజీసీని యంత్రాలతో తెగ్గొట్టిన గుర్తులు గుర్తించిన ఇంజినీర్లు
- చర్యల కోసం పోలీసులకు ఫిర్యాదు

బి.కొత్తకోట : అందరూ భావించినట్టు హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)కి బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద పడింది గండి కాదని.. యంత్రాల సాయంతో కాలువను తెగ్గొట్టారని ప్రాజెక్టు ఉన్నతాధికారులు నిర్ధారించారు. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రాజెక్టు జేఈఈ ఆంజనేయులు ఆదివారం రాత్రి బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనితో కాలువకు పడిన గండి సాంకేతిక సమస్య వల్ల కాదని, కావాలనే తెగ్గొట్టారని స్పష్టమవుతోంది. ఈ విషయం చర్చనీయాంశమైంది. తెగ్గొట్టిన కాలువ మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి.

అధికారుల్లో ఆందోళన

బి.కొత్తకోట మీదుగా సాగే పీబీసీ ద్వారా కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలని ప్రభుత్వం భావించి ఈనెల 9న చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను విడుదల చేసింది. మొదట నీటిని కుప్పం వరకు తీసుకెళ్లి, అక్కడి నుంచి చెరువులను నింపుకొంటూ రావాలని భావించారు. అయితే స్థానిక చెరువులకు నీళ్లు ఇవ్వాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం రైతులు ప్రాజెక్టు అధికారులను కలిసి విన్నవించగా ఇదే విషయం చెప్పారు.

అయితే అధికారులు ఊహించని విధంగా శెట్టిపల్లె వద్ద కాలువకు గండిపడటంతో వారిలో ఆందోళన మొదలైంది. గత శుక్రవారం ఎస్‌ఈ రాజగోపాల్ అధికారులతో కలిసి పెద్దతిప్పసముద్రం–బి.కొత్తకోట మండలాల మధ్య 26 కిలోమీటర్ల కాలువను పరిశీలించి.. ఎక్కడైనా గండిపడే అవకాశం ఉందా అని పరిశీలించగా అలాంటి పరిస్థితి లేదని నిర్ధారించారు. పరిశీలన జరిగిన ఒకరోజు తర్వాత ఆదివారం తెల్లవారుజామున శెట్టిపల్లె వద్ద గండి పడిందన్న సమాచారంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు.



శెట్టిపల్లె వద్ద చేపడుతున్న కాలువ పూడ్చివేత పనులు

గండిని పరిశీలించిన అధికారులు

గండిని పరిశీలించాక ఉన్నతాధికారులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మట్టి, కాంక్రీట్ నిర్మాణం, అక్విడెక్టు అంచు పరిశీలించాక అక్కడ అక్విడెక్టుకు యంత్రాలతో గోకినట్టు గుర్తించారు. అందులోనూ కట్ట మట్టి గండిపడేందుకు ఆస్కారం లేదని నిర్ధారించారు. సరిగ్గా అక్విడెక్టు అంచునే గండి పడటం అన్నది యాధృచ్ఛికం కాదన్న నిర్ధారణకు రావడమేకాక.. సరిగ్గా ఆలేరువాగులోకి నీళ్లు వెళ్లేలా గండి పడటం అసాధ్యమని సమీక్షించుకున్నాక.. ఇది కావాలనే చేశారని నిర్ధారించారు. దీనిపై జేఈఈ ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిలోమీటర్ 98.400 వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కాలువకు గండి పెట్టి నీళ్లు బయటకు వెళ్లేలా చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ముమ్మరంగా పనులు

కాలువకు మళ్లీ నీటిని విడుదల చేయాల్సి ఉండటంతో అధికారులు పూడ్చివేత పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు. ఈ పనులు పూర్తి కావస్తుండటంతో మంగళవారం చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించే అవకాశం ఉంది. ఇప్పటికే కాలువలో నిండుగా నీళ్లు ఉండటంతో చెర్లోపల్లె నుంచి నీరు విడుదల కాగానే కాలువలో ప్రవహించనున్నాయి.

క్లుప్తంగా

ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంట పరిశీలన



ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె : మండలంలోని అటవీ సమీప గ్రామం వైకోట శివారులో ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి, మామిడి, టెంకాయ చెట్లను ఫారెస్టు రేంజర్ అధికారి రఘునాథరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి భాస్కర్ సోమవారం పరిశీలించారు. దాదాపు నాలుగు ఎకరాల అరటి పంట, ఎకరా మామిడి చెట్లు, రెండు బోర్లు ధ్వంసమయ్యాయి. రేంజర్ అధికారి రఘునాథరెడ్డి మాట్లాడుతూ అడవిలో నుంచి ఏనుగులు రాకుండా అటవీ సమీపంలో (టెంచింగ్ చేసి గుంతలు ఏర్పాటు చేశామని, అక్కడక్కడా దారి కోసం వదిలిన ప్రదేశాల నుంచి వస్తున్నాయన్నారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ రైతులు ఎన్.సుబ్బరత్నమ్మ, కొండేటి చలపతికి సంబంధించి పంట నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, అటవీ శాఖ అధికారి మహేష్, సిబ్బంది జనార్దన్, వీఆర్‌ఓ సురేష్, ఉద్యానశాఖ సిబ్బంది యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



కేశవనాయుడు (ఫైల్)

మదనపల్లె : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. కదిరి మండలం బ్రాహ్మణపల్లె పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన రమణప్ప, రాజమ్మల కుమారుడు కేశవనాయుడు(22) గత కొంత కాలంగా తల్లిదండ్రులతో కలిసి మదనపల్లె చౌడేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా టమాట మార్కెట్‌లో పని చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కేశవనాయుడు సీటీఎం రైల్వేస్టేషన్ సమీపంలో గుంతకల్లు–తిరుపతి ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. రైలు కింద యువకుడు మృతి చెందిన సమాచారాన్ని స్థానికులు కదిరి రైల్వే పోలీసులకు తెలపడంతో.. హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని కదిరికి తరలించారు.

చోరీ కేసులో జరిమానా

రాయచోటి : చోరీ కేసులో నలుగురికి రూ.2 వేల వంతున జరిమానా విధిస్తూ రాయచోటి అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.శారద తీర్పు ఇచ్చారు. సోమవారం న్యాయమూర్తి ఈ తీర్పును వెలువరించినట్లు రాయచోటి అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం లక్ష్మీపురం పరిధిలో కేతిరెడ్డి రామనారాయణరెడ్డి నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో ఆగస్టు నెల 10వ తేదీన రాత్రి సమయంలో టేకు వుడ్‌తోపాటు రూ.80 వేలు విలువ చేసే సామగ్రిని దోచుకెళ్లిపోయారు. రామనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు కొమ్మడి ఫయాజ్(27), సొరకాయలపేట సయ్యద్‌బాషా(42), కోటకొండ గణేష్(23), షేక్ హుస్సేన్(36)ను అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. నేరాన్ని నిరూపించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు అభినందించారు.

ప్రియుడి కోసం భర్తను చంపిన భార్య

- తాగి కిందపడి చనిపోయాడని నమ్మించే యత్నం
- అనుమానంతో నిలదీయడంతో వెలుగులోకి వాస్తవం
- పోలీసుల అదుపులో భార్య, ప్రియుడు



వెంకటశివ మృతదేహం వద్ద విచారణ చేస్తున్న వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : ప్రియుడిపై మోజుతో కట్టుకున్న భర్తను భార్య అంతమొందించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. కాగా అతిగా మద్యం తాగిన భర్త ఇంటి ముందు పడి చనిపోయాడని నమ్మించే యత్నం చేసింది. పాచిక పారకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చి ప్రియుడితో సహా భార్య పోలీసులకు చిక్కింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం ఎర్రకోటపల్లె పంచాయతీ సింగనొడ్డు పల్లెకు చెందిన రఘునాథ్, నారాయణమ్మ దంపతుల రెండో కుమారుడు డి.వెంకటశివ(42) రెండేళ్ల నుంచి తన భార్య రమణమ్మ(35)తో కలిసి మదనపల్లె రామిరెడ్డిలేఅవుట్ వినాయకుని గుడి వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె కాగా ఆమెకు వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ స్థానిక టమాట మార్కెట్‌యార్డులో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో రమణమ్మ స్థానికంగా ఉంటున్న మరో యువకుడు గగన్(26)తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లిన వెంకటశివ భార్య రమణమ్మతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని, ఇంట్లోని రోకలిబండతో తలపై మోదింది. దీంతో వెంకటశివ అపస్మారకస్థితిలోకి వెళ్లగా.. ప్రియుడు గగన్‌తో కలిసి వైర్ సాయంతో గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఏమీ తెలియనట్లుగా... భర్త తరపు బంధువులకు ఫోన్ చేసి అతిగా మద్యం తాగి ఇంటి వద్దకు వచ్చి కిందపడి చనిపోయాడని సమాచారం అందించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లుగా తెలిపింది. రాత్రికి రాత్రి స్థానికుడైన ఆటోడ్రైవర్ రవిని పిలిచి చనిపోయిన విషయం దాచిపెట్టి, భర్త తాగిపడిపోయాడని, ఇంటికి తీసుకెళ్లేందుకు సాయం చేయాల్సిందిగా కోరింది. సింగనొడ్డు పల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లింది. అక్కడ వెంకటశివ మృతదేహాన్ని పరిశీలించిన అతడి కుటుంబ సభ్యులు తలపై, మెడపై గాయాలను గమనించి, భార్య రమణమ్మను నిలదీశారు. దీంతో ఆమె అసలు విషయం చెప్పడంతో కుటుంబ సభ్యులు కలకడ పోలీసులకు సమాచారం అందించారు. కలకడ పోలీసులు హత్య సమాచారాన్ని మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా మృతుడి స్వగ్రామం సింగనొడ్డుపల్లెకు వెళ్లి మృతదేహాన్ని, శరీరంపై గాయాలను పరిశీలించి, హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్నారు. శవ పంచనామా పూర్తిచేసి, మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనకు కారకులైన నిందితులు రమణమ్మ, గగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి అన్న వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

హార్సిలీహిల్స్‌పైకి ఇసుక అక్రమ తరలింపు

స్వాధీనం చేసుకున్న అధికారులు

బి.కొత్తకోట : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఏ నిర్మాణం జరిగినా టౌన్‌షిప్ కమిటీ అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ఓ వ్యక్తి రెవెన్యూ అతిథి గృహ నిర్మాణానికి అని.. అక్రమంగా ఓ టిప్పర్ ఇసుకను కొండపై తరలించగా దాన్ని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ వ్యక్తి కొండపై ఓ సినిమా నటికి చెందిన అతిథి గృహాన్ని కొనుగోలు చేసినట్టు ప్రచారం ఉంది. అయితే ఈ వ్యవహారం కోర్టులో ఉన్నట్టు సమాచారం. ఈ అతిథి గృహానికి సంబంధించి పనులు చేపట్టేందుకు ఆ వ్యక్తి ఈ నెల 26న టిప్పర్‌లో ఇసుకను కొండపైకి తరలించుకొంటుండగా.. టోల్‌గేట్ వద్ద టిప్పర్‌ను నిలిపి అనుమతి లేనిదే ఇసుకను తరలించకూడదని నిర్వాహకులు చెప్పగా.. నిర్మాణంలోని రెవెన్యూ అతిథిగృహం కోసం తరలిస్తున్నట్టు చెప్పడంతో సిబ్బంది నమ్మి పైకి పంపించారు. ఈ టిప్పర్ రెవెన్యూ అతిథిగృహం వద్దకు వెళ్లకుండా ఓ ప్రయివేటు అతిథి గృహంలోకి వెళ్లి ఇసుకను అన్‌లోడ్ చేసిన విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లింది. దీనితో అధికారుల ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది ప్రయివేటు అతిథి గృహం ఆవరణలో నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి ట్రాక్టర్లతో రెవెన్యూ అతిథిగృహం వద్దకు తరలించారు. కాగా అనుమతి లేకపోగా రెవెన్యూ శాఖ పేరుతో ఇసుకను అక్రమంగా తరలించడమేకాక.. ఇసుకను సీజ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి రెవెన్యూ సిబ్బందిని బెదిరించడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేయించడంపై సమీక్షిస్తున్నారు. టోల్‌గేట్ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బందితో జరిగిన విషయాలపై చర్చించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పగడ్బందీ చర్యలు చేపట్టనున్నట్టు తెలుస్తోంది.

1న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

రాయచోటి టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ రాం పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 31న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీలకంఠ్రావుపేటలో అండర్ -14, 17 త్రోబాల్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 1న అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మాసాపేటలో టెన్నికాయిట్ అండర్ -14, 17కు సంబంధించి ఎంపికలు జరుగుతాయన్నారు. 2న రాయచోటిలోని ఆలీమాబాద్ ఉన్నత పాఠశాలలో అండర్ -14 వాలీబాల్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. కడప ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.ఆరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలు



బాలికల విభాగంలో విజేత అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చెర్మన్ మనూజారెడ్డి

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్ బాల్ అండర్–19 బాల,బాలికల పోటీలు సోమవారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజారెడ్డి ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. మదనపల్లెలో బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం హర్షణీయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గిరిజ, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు వసంత, జయరామయ్య, బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, టోర్నమెంటు అబ్జర్వర్ వాకా నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేష్‌బాబు, నాగరాజు, అజీమ్, ప్రసాద్ పాల్గొన్నారు.

విజేతలు వీరే : అండర్–19 బాస్కెట్‌బాల్ బాలికల పోటీల్లో విన్నర్స్‌గా అనంతపురం, రన్నర్స్‌గా పశ్చిమగోదావరి, మూడవ స్థానం ఈస్టు గోదావరి, 4వ స్థానం గుంటూరు జట్లు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో విన్నర్స్‌గా తూర్పు గోదావరి, రన్నర్స్‌గా కృష్ణ, మూడవ స్థానం పశ్చిమ గోదావరి, నాల్గవ స్థానంలో విశాఖపట్నం నిలిచాయి.

రాష్ట్ర స్థాయి జట్టు వీరే

అండర్–19 బాస్కెట్‌బాల్ బాలుర జట్టులో ఉమామహేశ్వరరావు, ఫణీంద్ర, ఆదినారాయణ, నగేష్ బాబు, మస్తాన్, శ్రీవర్ధన్, సతీష్, అరుణ్‌పాల్, ప్రవీణ్, హేమంత ఆంటోని చైతన్య, మాధవ్, రమేష్ రెడ్డి, సిద్దార్థ, స్టాండ్‌బైలుగా రాజేష్, ఆకాష్, సాయి శ్రీ, వైష్ణవ్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టులో సోహాన, సాయి జ్యోతిక, పావనిప్రియ, పూర్ణచంద్రిక, అశ్రితదీప్తి, సింధూర, వర్షిత, మైథిలి, లాలిత్య, రక్షణ కుమారి, శ్రీలత, మమత, స్టాండ్‌బైలుగా మమతారాణి, నికిలారెడ్డి, వైష్ణవిలు ఎంపికయ్యారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన సబ్‌కలెక్టరేట్ సిబ్బంది



ఆత్మహత్యకు యత్నించిన శ్రీరాములును ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని సిబ్బంది కాపాడారు. అధికారులు చొరవ తీసుకుని అతన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం గ్రామం ఆంజనేయస్వామి కాలనీలో తలారి శ్రీరాములు, భార్య లక్ష్మితో కలిసి కాపురం ఉంటున్నాడు. వీరికి సొంత ఇల్లు లేకపోవడంతో గతంలో రామసముద్రంలో చెక్‌పోస్ట్ సిబ్బంది ఏర్పాటు చేసుకున్న గుడిసెలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు ఇల్లు మంజూరు చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరితే రామసముద్రం వీఆర్వో సర్వే నంబర్: 33.3లో 5 సెంట్ల స్థలం చూపించాడని తలారి శ్రీరాములు తెలిపారు. అందులో తాము కాంపౌండ్‌వాల్ వేసుకుని గుడిసె ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు.. ఆ స్థలం తమదంటూ దౌర్జన్యం చేస్తూ గుడిసెను తగులబెట్టేశారన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తాను, తన కుటుంబం రోడ్డున పడ్డామని, తమకు న్యాయం చేయాల్సిందిగా ఆర్డీకు వినతిపత్రం సమర్పించాడు. ఈ విషయమై ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అర్జీదారుడైన శ్రీరాములు ఎదుటే రామసముద్రం తహసీల్దార్‌కు ఫోన్ చేసి అర్జీలోని విషయం తెలిపి వివరణ కోరారు. దీనిపై ఆయన తన దృష్టికి రాలేదని, అర్జీదారుడిని తన వద్దకు పంపితే న్యాయం చేస్తానని చెప్పారు. దీంతో తలారి శ్రీరాములను ఆర్డీఓ రామసముద్రం తహసీల్దార్ వద్దకు వెళ్లాల్సిందిగా చెప్పడంతో, అక్కడికక్కడే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన సబ్ కలెక్టరేట్ సిబ్బంది.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.లక్ష్మీ సూచనతో ఉప్పునీరు తాగించి పురుగుల నివారణ మందు కక్కించే ప్రయత్నం చేశారు. 108 వాహనానికి సమాచారం అందించి జిల్లా ఆస్పత్రికి పంపి వైద్య చికిత్సలు అందించారు.